REGD. NO. A. 40 విడి ప్రతి 0-3-0 శుక్రవారం 26-6-59

# జమీన్ రైతు

సంపుటి 31 : సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు : సంపాదకుడు :: నెల్లూరు శ్రీరామమూర్తి : సంచిక 26

## హైదరాబాద్ లేఖ

*** మా విలేకరి ***

# స్వతంత్రపార్టీ- సోషలిష్టు డెమొక్రటిక్‌పార్టీ వైఖరి- ఎంత వేగంగా ఏకమైనారో, అంత త్వరగా విడిపోతారా?

రాజగోపాలచారి, మసాని ప్రభృతుల నాయకత్వాన అవతరిస్తున్న స్వతంత్రపార్టీ ప్రభావం ఆంధ్ర రాజకీయాలపై ఈవిధంగా వుంటుందని ఇప్పుడే చెప్పబూనడం సాహసమే అవుతుంది. కాని యిందువల్ల దేశమంతటావలెనే యిక్కడకూడా రాజకీయ భావాలు నిర్దుష్టత, విస్పష్టత పొందుతాయని నిస్సంశయంగా చెప్పవచ్చునని రాజధానిలో రాజకీయంగా విజ్ఞులైన వారభిప్రాయ పడుతున్నారు.

పించనుదార్లు, కాటికి కాళ్ళుచాచుకొని కూర్చున్నవారు క్రొత్తపార్టీలను పెట్టి సాధించేదేమీ ఉండదనే అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి వెలిబుచ్చినసంగతి అందరికీ తెలిసిందే. సాధారణ కాంగ్రెసు నాయకుల అభిప్రాయం ఇలాగే ఉంటుంది. కొన్ని దశాబ్దాలనుంచి ఆంధ్రప్రజలు కాంగ్రెసుపట్ల భక్తివిశ్వాసాలు వ్యక్తపరుస్తూ వస్తున్నారు. మరికొంత కాలం ఈ స్థితిలో మార్పు ఉండదనడానికి కొత్తపేట ఎన్నిక ఫలితాన్ని కొంతవరకు నిదర్శనంగా తీసుకోవచ్చును. అయినా ఇష్టమున్నా లేకపోయినా కాంగ్రెసుద్వారానో ఏ ఇతర పార్టీద్వారానో సోషలిజమునే వరించవలసిన అవసరం ఇక ప్రజలకు ఉండదు. కాంగ్రెసులో కూడా చాలామందికి వ్యవసాయ సంస్కరణల గురించిన నాగపూరు తీర్మానములో విశ్వాసంలేదు. వీరిలో కొందరు కేవలం అవకాశవాదులై అధికారంలో పాలుకోసం కాంగ్రెసునే అంటిపెట్టుకొని ఉన్నప్పటికీ, అలాంటి అవసరంలేనివారు తమ ప్రయోజనాల సంరక్షణకోసం కాంగ్రెసు అనే ముసుగును తొలగించి బహిరంగముగా పోటుబడవచ్చును.

ఆచార్య రంగాగారు వెల్లడించినట్టు ఆయనతోపాటు అయిదుగురో-ఆరుగురో ఆంధ్ర కాంగ్రెసు శాసనసభ్యులు కాంగ్రెసునుంచి వైదొలగవచ్చును. ఇది అందరూ ఆశించినదే. కాని ఈ స్వతంత్రపార్టీ నిర్మాణం ఒక ఆరు మాసాలు ముందుగా జరిగినట్టయితే, ప్రస్తుతం డెమొక్రటిక్ పార్టీలోచేరి తద్వారా సోషలిష్టు డెమొక్రటిక్ పక్షంగా విలీనమైన వారిలో చాలామంది మరోవిధంగా ప్రవర్తించేవారేమో. డెమొక్రటిక్ పార్టీ నాయకులైన లచ్చన్న, డాక్టర్ చెన్నారెడ్డిగార్లకు ఆచార్య రంగా గురువు లచ్చన్నగారు స్వభావసిద్ధంగా తీవ్రవాదులు. వారిని వదిలేస్తే మిగిలిన డెమొక్రాట్లలో పూర్వపు కృషికర్‌లోక్‌పార్టీకి చెందినవారు, అలాంటి మనోభావాలు కల వారు పలువురు వున్నారు.

నిజానికి ఈ సోషలిస్టులు డెమొక్రాట్‌లు ఎంత వేగంగా ఏకమైనారో అంత వేగంగానే విడిపోయే సూచనలు కనబడుతున్నాయని ఇక్కడ కొందరు చెబుతున్నారు. "తెనాలి సమ్మేళనంలో డెమొక్రటిక్ నాయకులు చేసిన ప్రసంగాలు చూస్తే వారు సోషలిష్టులతో చేతులు కలిపినప్పటికీ వారి మనస్సంతా కన్సర్వేటివ్ పార్టీ అయిన స్వతంత్రపార్టీపైనే ఉన్నదని స్పష్టమవుతుంది" అని కొందరు ఇక్కడ స్పష్టంగా నమ్ముతున్నారు.

సోషలిష్టు నాయకులైన పి. వి. జి. గారు తెనాలి సమ్మేళనానికి ప్రారంభోత్సవం చేస్తూ "స్వతంత్రపార్టీ కన్సర్వేటివ్ పార్టీ కనుక ప్రస్తుత సామాజిక వ్యవస్థలో ఎలాంటిమార్పు చేయకుండా యధాతథంగా వుంచాలని కోరుతుంది. కాబట్టి అది కాంగ్రెసుకు ప్రత్యామ్నాయపార్టీ కాజాలదు" అని అన్నారు. సమ్మేళనానికి అధ్యక్షత వహించిన డాక్టర్ చెన్నారెడ్డిగారు అమ్మదాబాదులో స్వతంత్రపార్టీమహాసభ అనంతరం ఆపార్టీతో తాము సన్నిహిత సంబంధాన్ని నెలకొల్పుకోవచ్చునని చెప్పారు. ఈ రెండు అభిప్రాయాలలో ప్రధానమైన విభేదం కనబడుతున్నది.

కాబట్టి సాంకేతికమైన సోషలిష్టు డెమొక్రటిక్‌పార్టీలో కొందరు చీలి స్వతంత్ర పార్టీలో చేరవచ్చునని కొన్ని వర్గాలు, ముఖ్యంగా కాంగ్రెసువర్గాలు ఇక్కడ భావిస్తున్నాయి. పత్రికలలో వెలువడిన ప్రకారం పై రెండు అభిప్రాయాలలోను దృక్పథాలలోను ప్రధానమైన తేడా లేకపోలేదు. కాని ఈ రెండు కొత్తపార్టీలకూ (సో. డె. పార్టీ, స్వతంత్రపార్టీ) సర్వోదయ నాయకుడు భారత సోషలిష్టు డెమోక్రసీకి ఆరాధ్యమూర్తి అని భావించబడుతున్న జయప్రకాశ్ నారాయణ ఆశీర్వచనముంది. ఆయన పలుకుబడి క్రింద ఈ రెండు సంస్థలలో ఏమైనా చీలికలు కలిగితే అవి కాంగ్రెసుకు అనుకూలంగా మాత్రం వుండకపోవచ్చును.

ఇది ఇలా వుండగా పి. వి. జి. రాజుగారితో పాటు లోహియా సోషలిష్టుపార్టీకి తిలోదకాలు ఇచ్చిన సోషలిష్టు నాయకులు మరికొందరు వున్నారు. "అభివృద్ధి నిరోధకులైన" డెమొక్రాట్లతో సోషలిష్టులు కలిసిపోవడం వీరికి ఇష్టంలేదు. ఇలాంటివారిలో హైదరాబాదు సోషలిష్టులలో ప్రధములైన శ్రీ బి. యస్. మహాదేవసింగ్ వున్నారు.

—— (22-6-59)


## నెల్లూరు జిల్లా

# పంచాయతీ మహాసభ

**5-7-59 తేది ఆదివారం పగలు 11 గం॥కు**

నెల్లూరుజిల్లా పంచాయతీ అధ్యక్షుల తృతీయ మహాసభ 5-7-59 తేది ఆదివారం పగలు 11 గం॥కు మునిసిపల్ ఆఫీసు ఆవరణలో జరుగును.

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి

**శ్రీ నీలం సంజీవరెడ్డిగారు**

మహాసభలకు ప్రారంభోత్సవం జరుపుదురు.

స్థానిక స్వపరిపాలనా మంత్రి

**శ్రీ దామోదరం సంజీవయ్యగారు**

అధ్యక్షత వహింతురు.

స్థానికసంస్థల ఇన్‌స్పెక్టర్ జనరల్

**శ్రీ జి. సింహాద్రిగారు**

ఉపన్యసింతురు.

పంచాయతీ అధ్యక్షులందరు మహాసభకు విచ్చేయ ప్రార్థన. క్రొత్తగా ఏర్పడిన పంచాయతీ అధ్యక్షులుకూడా, ఒకవేళ ఆహ్వానాలు తప్పిపోయిన పక్షంలో, యిదే ఆహ్వానంగా భావించి మహాసభలో పాల్గొనప్రార్థన. సభ్యత్వరుసుము, ప్రతినిధిరుసుము మహాసభకు వచ్చునపుడు తీసుకొని రావలెను.

**5-7-59 కార్యక్రమము**

ఉదయం 7-30 గం॥కు కార్యవర్గ సమావేశము.

,, 11-00 గం॥కు మహాసభ.

మ॥ 3 గం॥ నుండి రాత్రి 8 గం॥ వరకు ప్రతినిధుల సమావేశం (మునిసిపల్ ఆఫీసులో.)

రాత్రి 8.00 గం॥కు విందు.

,, 9-00 గం॥కు వినోద ప్రదర్శనలు (టౌనుహాలులో)

నెల్లూరు 26.6.59

నల్లి




## ● స్వతంత్ర పార్టీవల్ల కలిగినమేలు
## ● మరిక ఎందుకీ పార్టీవిధానం?
## ● కేరళ చివరకు ఏమవుతుంది?

క్రొత్తపార్టీ ఆర్భాటం ఎక్కువగా వున్నది. బొంబాయిలో భారత వ్యాపారమండలి భవనంలో సభజరిగితే, జనం కిక్కిరిసిపోయారు. చాలమంది చోటుచాలక వెళ్ళిపోవలసి వచ్చింది. ఈ విషయాన్ని పెద్దగా అడ్వర్‌టైజ్‌మెంట్ ద్వారా ప్రకటించి, 'స్వతంత్ర పార్టీ' అభిమానులవద్ద ఆర్గనైజేషన్ నిమిత్తం ఆర్థికసాయం అపేక్షించింది.

ఈ పార్టీకి నాయకత్వం వహించవలసిందని జయప్రకాశ్‌ను కోరినట్లూ, తాను నాన్-పార్టీ మనిషినిగనుక అది సాధ్యంగాదని ఆయన అన్నట్లూ, మసానీ తెలియజేశాడు. నాన్-పార్టీ జయప్రకాశ్ పార్టీసభలకు పోవచ్చునా? అని నిక్కటంగా కొందరనవచ్చు. ఏపార్టీలోలేని వారికి అన్నిపార్టీ సభలకు, పిలిచినపుడు, పోవడానికి ప్రత్యేకార్హత వుండవచ్చును గనుక జయప్రకాశ్ క్రొత్త పార్టీ సభలకు వెళ్లడం, తన అభిప్రాయాలు చెబుతూ అట్టి సభలకు అధ్యక్షత వహించడం దోషములుగా పరిగణించబడవు.

మన దేశంలో అన్నివ్యవహారాలు ఒక తీరుగానే వుంటున్నవి. సర్వోదయం వలన రాజకీయాలమీద ఎంత ప్రభావం పడిందో అంత రాజకీయాల ప్రభావం సర్వోదయం మీదకూడా పడినట్లున్నది! నాన్-పార్టీ సర్వోదయులు పార్టీనేతలకు ఆశీస్సులను నిరాటంకంగా అందించగలరు. పార్టీ వారు నాన్-పార్టీ ధోరణిలో కృషిచేసేటందుకు (కొన్ని అంశములందు) సిద్ధపడగలరు. ఒక పార్టీ నాయకుడు ఒక సర్వోదయ నాయకాగ్రణియొక్క ఆశీర్వాదాన్ని పొందుతూ వుంటే, రెండవపార్టీ నాయకులు మరొక సర్వోదయ నాయకుని శుభాకాంక్షలను పొందుతారు.

సిద్ధాంతాల దృష్ట్యాచూస్తే, నెహ్రూ — పరిమితమైన నెహ్రూబృందం — ఇందిరాగాంధి, ధేబర్ ఇత్యాదులు, పి.యస్.పి.లో అశోకులు, యస్. పి. వారు ఒకటిగా కలియవలసివున్నది. నేటి కాంగ్రెస్ ముఖ్యులలోని అత్యధిక సంఖ్యాకులు క్రొత్తపార్టీలో చేరవలసియున్నది. అటు పిమ్మట, రెంటి రూపురేఖలు వివరంగా తెలియగానే, అన్నిపార్టీల సాధారణ సభ్యులు అటో — ఇటో వెళ్లి చేరవచ్చు.

అట్టి దృష్టి లేకపోతే నాయకులపోట్లాట అధికమవుతుంది. వివాదం అనవసరంగా సమస్యలపై పెరుగుతూ వుంటుంది.

ఈ క్రొత్త పార్టీవల్ల ఒక్కమేలు మాత్రం దేశానికిజరిగింది. ఏకపార్టీ — ఏకవ్యక్తి పాలన, మార్గదర్శనం యింకామించి సిద్ధమైపోయిన సమయంలో, ఉచ్చులువిప్పి స్వేచ్ఛగా నలుగురికీ వాక్ స్వాతంత్ర్యం ప్రసాదించిన రాజాజీకి భారత ప్రజాస్వామికం నమోవాకములర్పిస్తున్నది. రెండవసంగతి: నెహ్రూ బోధ నచ్చక, తేరుదారిగానక కాంగ్రెసులోనే వున్నవారికి ధైర్యంగా యీవలికి రావడానికి ఒక వేదికను 'స్వతంత్రపార్టీ' నిర్మించినది.

ఇట్టి వేదికను తత్ క్షణమే వినియోగించుకున్న రంగాగారి ధైర్యము ప్రశంసనీయము. కొన్ని దశాబ్దాలుగా ఆయన వాంఛిస్తూ వచ్చిన పార్టీవంటి నిర్మాణం నేటికి సిద్ధమైనది. మరి ఆయనను అనుసరిస్తూవచ్చి చీలిపోయిన బృందం మళ్లీ ఏకమై ఈ 'స్వతంత్ర పార్టీ'లో స్వతంత్రంగా చేరదరా? వీరు అనేకంగా చిలవలు — పలవలైనారు; ఒక తరహాగాలేరు; కాని వారి భావాలు ఈ రచయితకు తెలిసినంతవరకు మారలేదు. తమ భావములందు తమకు భక్తి శ్రద్ధలున్నచో, వారికి ఈ పార్టీలో చేరడమే ఉత్తమమైన మార్గం.

"స్వధర్మేనిధనం శ్రేయః—
పరధర్మో భయావహః"

• • •

ఈ చిత్రమేమిటిది? బొంబాయి రాష్ట్రాన్ని చీల్చమనే వారంతా కలిసి (వీరిలో నానా రాజకీయ రకాలున్నవి) తృతీయ పంచవర్ష ప్రణాళిక స్వరూపాన్ని దిద్ది ప్రజలముందు ప్రవేశపెట్టబోతున్నారు. ఇకను, కార్యసాధనకు వినోబా మార్గమే శరణ్యమైనదా?

ఈబుద్ధి విరోధి వర్గాలకేగాక, పాలక వర్గాలకూ పుట్టింది! అఖిలభారత కాంగ్రెస్ కమిటీవారి చర్చావేదిక విభాగం అన్నిపార్టీలను సంప్రదించి తృతీయ ప్రణాళిక పథకాన్ని సిద్ధం చేస్తుందట. కార్యసాధనకు వీరికీ వినోబామార్గమే శరణ్యమైనదా?

కేరళలో ఒకర్ని దించడానికి మిగిలిన పార్టీలన్నీ ఏకమవుతున్నవి. ఇందులో ఉద్దేశ్యం నకారాత్మకమైనా, సమష్టి కృషికి నలుగురు — భిన్నమైన పద్ధతులవారు — ఏకంగాక తప్పదని తేలుతున్నది.

మరిక ఎందుకీ పార్టీవిధానం?

పార్టీలు, క్రొత్తవి—పాతవి అభిప్రాయాల ప్రచారంకోసం వుండవలసిందేగాని కార్యసాధనకు స్వేచ్ఛగా కలియగలిగిన వారంతా కలిసి కృషిచేయగలిగిన మార్గాన్ని వెతకడమే ప్రగతికి మంచిది.

• • •

—తరువాత 10 వ పేజీలో

### శ్రీ కస్తూరి శ్రీనివాసన్ అస్తమయం


●

### 'హిందూ' పత్రిక సంపాదకుడు

చంచలత రహిత పత్రికా రచనకు, విశ్వసనీయమైన వార్తలకు, మితవాద అభిప్రాయాలకు ప్రసిద్ధి కెక్కిన 'హిందూ' పత్రిక సంపాదకులు శ్రీ కస్తూరి శ్రీనివాసన్ గారు, తన 72వ ఏట, 21 తేది రాత్రి మద్రాసులో అస్తమించారు. శ్రీ శ్రీనివాసన్ ఆ పత్రికకు 25 సంవత్సరాలు సంపాదకుడుగా వుండి, 'హిందూ'కు విశ్వ ఖ్యాతి సంపాదించిన వ్యక్తి. అఖిల భారత పత్రికా సంపాదకుల సంఘ అధ్యక్షులుగా పి. టి. ఐ. వార్తా సంస్థ అధ్యక్షులుగా వీరు పనిచేశారు. ఎన్నో పర్యాయములు ప్రపంచ పర్యటన గావించారు. వీరి మరణం 'హిందూ'కేగాదు, భారతపత్రికా రంగానికే తీరనిలోటు.

శ్రీ శ్రీనివాసన్ ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించుగాక. వారి కుటుంబానికి మా సానుభూతి.

### ★★★ బొంబయిలో పాడిపరిశ్రమ కేంద్రం ★★★



బొంబయి సమీపంలోని ఆనంద్ అనుచోట పెద్ద పాడిపరిశ్రమ కేంద్రం నెలకొల్పబడి వుంది. బొంబయి నగరానికి పాలసరఫరా దాదాపు పూర్తిగా దీనివల్లనే జరుగుతుంది.

ఈ చిత్రంలో పైవరుసలో ఎడమవైపు పరిశుభ్రమైన కొట్టంలో కట్టివేయబడిన ఉత్తమజాతి బఱ్ఱెలపాలు పితకడాన్ని చూడవచ్చు

కుడివైపు చిత్రం—ఈ పాడిపరిశ్రమ కేంద్ర కార్యాలయ భవనం.

క్రింది చిత్రంలో పాలను సీసాలలోపట్టి సీలువేయడాన్ని చూడవచ్చు.

